

విద్యా సామగ్రి పంపిణీ


దాతలతో విద్యార్థులు

వీరబల్లి : మండలంలోని పెద్దివీడు పంచాయతీ మాదిగపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో చదువుకుంటున్న 31 మంది విద్యార్థులకు మంగళవారం ఎస్ఆర్‌బి కల్యాణ రాజు, ఉపాధ్యాయులు తిరుపతి, విశాలి ఆధ్వర్యంలో ఎంఇఒ చేతుల మీదుగా విద్యాసామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా దాత మాట్లాడుతూ క్రమశిక్షణతో చదువుకుంటే విద్యార్థులు ఉన్నత స్థానానికి ఎదుగుతారని చెప్పారు. ఉపాధ్యాయులు సూచనలు సలహాలు పాటించాలని పాఠశాలకు హాజరుకావాలని ఆయన కోరారు. ప్రతి ఒక్కరూ కొంత సమయాన్ని కేటాయించి సామాజిక సేవ చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. తన వంతు సహకారంగా పదిలో 90 శాతం మార్కులు వచ్చిన పేద విద్యార్థులు ఐదుగురిని ఎంపిక చేసుకుని వారిని ఉన్నత చదువులు చదివిస్తానని హామీ ఇచ్చారు. ఎంఇఒ మాట్లాడుతూ దాతలు ముందుకొచ్చి విద్యార్థులకు అండగా నిలవడం శుభపరిణామమని చెప్పారు. అనంతరం దాతలను ఆయన అభినందించి, శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెడ్మాస్టర్ మనోహర్ రెడ్డి, దాత రెడ్డి శేఖర్ రాజు, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.



ప్రజాశక్తి - రామసముద్రం

వర్షాలు కురుస్తాయనే ఆశతో విత్తనాలు నాటిన రైతులు ఇబ్బందులు పడుతున్నారు. వర్షం కోసం ఎదురు చూస్తున్నారు. సీజన్‌లో ఎన్నో ఆశలతో రైతులు సాగు చేసిన వేరుశనగ పంటల ఎదుగుదలకు అండగా నిలవాల్సిన వర్షం రాకపోవడంతో రైతులు సతమతమవుతున్నారు. ఇప్పటికే భూమిలో వేసిన విత్తనాలు మొలకెత్తక ఎండుతున్న పంటలను చూస్తు రాబోయే రోజుల్లో ముంచుకొస్తున్న ఆర్థిక కష్టాలను తలుచుకుంటు ఆందోళన చెందుతున్నారు. జూన్ ఆరంభలో వర్షాలు బాగానే కురిపించడంతో మునుముందు కూడా వర్షాలు బాగానే పడుతాయన్న ఆశలతో రైతులు ఖరీఫ్ పంటల సాగుకు శ్రీకారం చుట్టారు. ప్రభుత్వం నుండి సైతం పంట పెట్టుబడి సాయం కూడా అందడంతో రైతులు ధైర్యంగా వానకాలం పంటల సాగు చేపట్టగా వారి నమ్మకానికి వరుణుడు గండి కొడుతున్నాడు. జులై, ఆగస్టు నెలల్లో సాధారణ వర్షాపాతం కంటే ఆత్యల్పంగా వర్షపాతం నమోదైంది. ఇప్పటికే 200 హెక్టార్లలో వేరుశనగ సాగైంది. ఈ సంవత్సరం వేరుశనగ పంటకు ప్రతికూల వాతావరణ పరిస్థితులు నెలకొన్నాయి. వర్షాపాతంలో భారీగా లోటు.. నెల రోజులుగా జాడ లేని వానలతో సొమ్మసిల్లి పోతున్నారు. ప్రస్తుతం నియోజకవర్గ పరిధిలోని 3 మండలాల్లో సాధారణ వర్షాపాతానికి ఈ సీజన్‌లో నమోదైన వర్షాపాతానికి మధ్య నెలకొన్న భారీ లోటు వర్షాభావ పరిస్థితులను చాటుతున్నాయి. ప్రస్తుతం నియోజకవర్గంలో సాధారణం కంటే తక్కువ వర్షాపాతం నమోదవ్వడంతో మెట్టపంటలు వర్షాభావంతో ఎండిపోతున్నాయి. రైతులు పంటల రక్షణకు ఇబ్బడి ముబ్బడిగా బోర్లు వేస్తు మరిన్ని అప్పుల దిశగా సాగుతుండటం ఆందోళన రేకెత్తిస్తుంది. మంచి వర్షాలు కురిపిస్తేనే నియోజకవర్గ రైతుల కష్టాలు తీరుతాయని లేదంటే మరోసారి రైతులు ప్రతికూల వాతావరణ పరిస్థితులతో నష్టపోవడం ఖాయమన్న ఆందోళన రైతుల్లో వ్యకమవుతుంది. వర్షాధార భూములున్న ప్రాంతాల్లో సాగుచేసే పంటలకు వర్షాలే కీలకం. ఒక సారి వర్షం పడిన తరవాత మరో వర్షం ఎన్నిరోజుల్లో కురిసిందనే లెక్కల ఆధారంగా పంటల దిగుబడులను అంచనా వేస్తారు. కేంద్ర ప్రభుత్వం గతేడాది కరవును గుర్తించేందుకు కొత్త నిబంధనలు తెచ్చింది. వీటి ప్రకారం ఒక ప్రాంతంలో ఒక సారి వర్షం కురిసిన రోజు నుంచి 20 నుంచి 28 రోజుల వరకూ సరైన వర్షం పడకపోతే 'పొడి విరామం' (డ్రైస్పెల్) ఏర్పడి పంటలు ఎండిపోయి కరవు నెలకొన్నట్లు గుర్తిస్తారు. ఈ నెలలో నైరుతి రుతుపవనాలు ప్రవేశించి వర్షాలు అధికంగా పడాల్సివుంది. ఐతే అందుకు భిన్నంగా మొదట్లో ఆశ చూపిన వర్షాలు తీరా భూమిలో వేరుశనగ విత్తనాలు వేసిన తరువాత పూర్తిగా వరుణుడు ముఖం చాటేయడంతో భూమిలో సరైన తేమ శాతం లేక వేసిన విత్తనాలు మొలకెత్తకపోవడం, మరోప్రక్క పంటలు ఎండిపోయే పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో రైతుల ఆశలు సన్నగిల్లాయి. ఈ ఏటా రైతులకు అడుగడుగునా అడ్డంకులే తప్పవంటున్నారు. సమయంలో వర్షం కురవకపోవడంతో ఏమిచేయాలో అర్థం కాక ఆకాశం వైపు ఆశగా చూస్తున్నారు. రెండు మూడు రోజుల్లో వర్షాలు కురవకపోతే వేరుశనగపై ఆశలు వదులుకోవాల్సిందే అని రైతులు ఆందోళన చెందుతున్నారు. పెట్టుబడులు కూడా వచ్చేటట్లు లేవని రైతులు బోరుమంటున్నారు. ప్రభుత్వం స్పందించి వేరుశనగ రైతులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరుకుంటున్నారు. మండలంలో వర్షాబావ పరిస్తితిలో వేరుశనగ రైతులు పూర్తిగా నష్టపోయారని వారికీ ప్రభుత్వం తరుపున ఇన్పుట్ సబ్సిడీ ఇవ్వాలని, రాష్ట్ర ప్రభుత్వం వేరుశనగ పంట పూర్తిగా ఎండిపోయిన రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు


వర్షం లేకపోవడంతో ఎండిపోతున్న వేరుశనగ పంట

అధిక ధరలపై నేటి నుంచి సమరభేరి : సిపిఎం

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

అధిక ధరలు, నిరుద్యోగం, విద్యుత్, ఆర్టీసీ ఛార్జీల భారాలతో ప్రజలను దోచుకుతింటున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 30 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా సమరభేరి పేరుతో ఆందోళన కార్యక్రమం చేపట్టనున్నట్లు సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎ.రామాంజులు తెలిపారు. మంగళవారం స్థానిక సిపిఎం జిల్లా కార్యాలయంలో సమరభేరి పోస్టర్‌లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రం విధిస్తున్న షరతులకు తలొగ్గి రాష్ట్రం ఇష్టం వచ్చినట్లు భారాలు మోపుతోందని అన్నారు. ప్రపంచ బ్యాంకు షరతులను కేంద్రం అమలు చేస్తూ రాష్ట్రాలపైనా రుద్దుతోందని చెప్పారు. రాష్ట్రం కూడా అప్పుల కోసం కేంద్రం విధించిన షరతులన్నీ అమలు చేస్తోందని వాపోయారు. దీనివల్ల సామాన్య ప్రజలపై మోయలేని భారాలు పడుతున్నాయని తెలిపారు. ముఖ్యంగా విద్యుత్ ఛార్జీల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం అన్యాయంగా వ్యవహరిస్తోందని, గతంలో రూ.150 బిల్లు వస్తే ఇప్పుడు రూ.300 వస్తోందని, అంటే బిల్లు 100 శాతం పెరిగిందని, ఇంత పెద్దఎత్తున భారాలు పడుతుండటంతో పరిశ్రమలు కూడా మూతబడుతున్నాయని చెప్పారు. ఇవి చాలదన్నట్లు వ్యవసాయ మోటార్లకు, ఇళ్లకు స్మార్ట్ మీటర్లు పెట్టేందుకు సిద్ధమయ్యారని విమర్శించారు. ట్రూఅప్, ఫ్యూయల్ సర్‌ఛార్జి పేరుతో ఎప్పుడో వాడుకున్న విద్యుత్‌కు ఇప్పుడు భారాలు వేస్తున్నారని, అద్దె ఇళ్లలో ఉండే సామాన్యులకు ఇది పెనుభారంగా మారుతోందని వివరించారు. ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిపక్షంలో ఉండగా విద్యుత్ ఛార్జీలకు వ్యతిరేకంగా చేసిన ఆందోళనలను, ఆయన తండ్రి రాజశేఖరరెడ్డి చేసిన దీక్షలను గుర్తుచేశారు. అధికారంలోకి రాగానే తన సొంత కంపెనీలకే వాటాలు కట్టబెడుతూ దోచుకుంటున్నారని విమర్శించారు. స్మార్ట్ మీటర్లను అదానీ కంపెనీల నుండి కొనుగోలు చేస్తున్నారని వివరించారు. ఈ నెల 30, 31 తేదీల్లో ప్రచారం, సంతకాల సేకరణ, ఒకటోతేదీన సచివాలయాల్లో వినతిపత్రాలు సమర్పిస్తామని, నాలుగోతేదీన అన్ని మండల కార్యాలయాల వద్ద ధర్నాలు చేపడతామని పేర్కొన్నారు. అప్పటికీ ప్రభుత్వం స్పందించకపోతే ప్రజా ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం చలపతివీధి, పిండిమిషన్ లైన్, కొత్తపేట, సాయిహాల్ రూట్‌లోని ప్రతి ఇంటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు యం.మాధవయ్య శేఖర్ రెడ్డెయ్య అనిల్ పాల్గొన్నారు.


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

వేగవంతంగా భూసేకరణ : కలెక్టర్


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గిరీష

ప్రజాశక్తి - రాయచోటి

మంగంపేట బైరటిస్ ప్రాజెక్టుకు సంబంధించి భూసేకరణ వేగవంతం చేయాలని కలెక్టర్ గిరీష పిఎస్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్‌హాల్‌లో మంగంపేట బైరటిస్ ప్రాజెక్టుకు సంబంధించి భూసేకరణపై సంబంధిత అధికారులతో కలెక్టర్ పిఎస్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలోనే ప్రఖ్యాతిగాంచిన మంగంపేట బైరటిస్ ప్రాజెక్టుకు సంబంధించి ఆర్ అండ్ ఆర్‌కు ఎన్ని కోట్లు ఖర్చు చేశారు, ఇప్పటి వరకు నష్ట పరిహారం ఎంత ఇచ్చారు, తదితర వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. మంగంపేట బెరైటీస్ ప్రాజెక్టు పరిధిలో ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకొని హద్దులు ఏర్పాటు చేయాలన్నారు. ఆర్అండ్ ఆర్ క్లెయిమ్స్ త్వరగా క్లియర్ చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. భూసేకరణకు సంబంధించి ఎటువంటి సమస్యలు లేకుండా చూడాలని ఎపిఎండిసి అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా గూగుల్ మ్యాప్ ద్వారా మంగంపేట వెరైటీస్ ప్రాజెక్టు పరిధిలోని భూములను పరిశీలించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఫర్మన్ అహ్మద్ ఖాన్, రాజంపేట ఆర్డీవో రామకృష్ణారెడ్డి, ఎపిఎండిసి అధికారులు, ఓబులవారిపల్లి తహశీల్దార్ పీరుమున్నీ పాల్గొన్నారు.


కంప్యూటర్ శిక్షణ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్ అబ్దుల్ కలీమ్

సిఎం జగన్ ఆశయాన్ని సఫలం చేయాలి

- రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్ అబ్దుల్ కలీమ్

ప్రజాశక్తి - వాల్మీకిపురం

యువత ఉజ్వల భవిష్యత్తు కోసం పరితపిస్తున్న సిఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆశయాన్ని సఫలం చేయాలని రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్ అబ్దుల్ కలీమ్ అన్నారు. మంగళవారం ఆయన స్థానిక ఉర్దూ అకాడమీ కంప్యూటర్ శిక్షణ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బందితో ఆయన మాట్లాడుతూ ముస్లిం మైనారిటీ, నిరుపేద యువతకు ఉచితంగా కంప్యూటర్ కోర్సులో శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పించడమే రాష్ట్రంలోని వైసీపీ ప్రభుత్వ ధ్యేయమన్నారు. స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్‌తో ఉర్దూ అకాడమీ ఎంఒయును చేసుకొని ఉచిత కంప్యూటర్ శిక్షణ కార్యక్రమాన్ని చేపట్టినట్లు, శిక్షణ తీసుకున్న వారికి స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్, ఉర్దూ అకాడమీలు సంయుక్తంగా సర్టిఫికెట్లను కూడా ఇవ్వడం జరుగుతుందన్నారు. ఉపాధి అవకాశాలలో ఈ సర్టిఫికెట్లు కలిగిన వారికి ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని, ఉర్దూ అకాడమీ ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఈ కార్యక్రమాన్ని సిబ్బంది సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. సమయపాలన పాటించాలని, శిక్షణా కేంద్రానికి వచ్చే యువతకు అర్థమయ్యే రీతిలో కంప్యూటర్ కోర్సులను నేర్పించాలన్నారు. స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ద్వారా త్వరలో ఉర్దూ అకాడమీ కంప్యూటర్ శిక్షణ కేంద్రాలకు ల్యాబ్ టాబ్‌లు ఇవ్వనున్నట్లు, వీటి ఆధారంగా మరింత మెరుగైన పద్ధతిలో శిక్షణా కార్యక్రమాన్ని కొనసాగించాలన్నారు. సిఎం జగన్మోహన్‌రెడ్డి విద్యాభివృద్ధికి, యువత ఉజ్వల భవిష్యత్తుకు అనేక కార్యక్రమాలను అమలు చేస్తున్నారని, ఆయా శాఖల సిబ్బంది సమర్థవంతంగా విధులను నిర్వర్తించినప్పుడే ప్రభుత్వ కార్యక్రమాల లక్ష్యాలు, ఆశయాలు నెరవేరుతాయి అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారులు ఎం.ఆబిద్ హుస్సేన్, జాహెద్ హుస్సేన్, కంప్యూటర్ శిక్షణ కేంద్రం ఇన్‌ఛార్జి ఫైరోజ్ అలీ ఖాన్, సిబ్బంది ఫైరోజ్ పాల్గొన్నారు.

హెల్ప్ డెస్క్ ఏర్పాటు

రాయచోటి: ప్రభుత్వం మధ్య తరగతి కుటుంబాల కోసం ఎంతో ప్రతిష్టత్మాకంగా చేపట్టిన ఎంఐజి ఫేస్-2 ఆన్‌లైన్ నమోదు కోసం మున్సిపల్ కార్యాలయంలో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ గంగా ప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఏవైనా సందేహాలు ఉంటే మున్సిపల్ కార్యాలయ టౌన్ ప్లానింగ్ విభాగం నందలి ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్ సిబ్బందిని ఫోన్ ద్వారా కానీ ,కార్యాలయంలో కానీ సంప్రదించాలన్నారు.

సంక్షేమాభివృద్ధిలో సరికొత్త అడుగులు : ఎమ్మెల్యే

గాలివీడు : సిఎం జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమాభివృద్ధిలో సరికొత్త అడుగులు వేస్తున్నారని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని పూలుకుంట పంచాయతీలో వడ్డేపల్లి, బండమీదపల్లె, గుండికాడపల్లె, రెడ్డివారిపల్లె, పూలికుంట దళితవాడ, మంగళపల్లె, ఈడిగపల్లెల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటా తిరుగుతూ ప్రభుత్వం అందిస్తున్న పథకాలును వివరిస్తూ, సమస్యలపై ఆరా తీస్తూ కార్యక్రమాన్ని కొనసాగించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టోలో జగన్ ఇచ్చిన హామీలను తొంభై తొమ్మిది శాతానికి పైగా అమలుచేయడంతో ప్రతి ఇంటా సంక్షేమ బావుటా ఎగురుతోందన్నారు. సంక్షేమా భివృద్ధిలో సిఎం జగన్ సరికొత్త అడుగులు వేస్తున్నారన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి మిట్టపల్లి యదుభూషణ్ రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆవుల నాగభూషణ్ రెడ్డి, మాజీ వైస్ ఎంపిపి కుర్మయగారి రమేష్‌రెడ్డి, వైసిపి రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి గుమ్మ అమరనాథ్ రెడ్డి, ఎంపిటిసి గడ్డం చంద్ర ప్రకాష్ రెడ్డి, సర్పంచులు ఉమాపతి రెడ్డి,దేరంగుల నారాయణ,ఉమా ప్రభాకర్, జానకిరామంజులు రెడ్డి, కామసాని కేశవ రెడ్డి,ఉప సర్పంచ్ మన్సూర్ బాష, సచివాలయ కన్వీనర్ పూలికుంట హరినాధ రెడ్డి పాల్గొన్నారు.


ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న నాయకులు

కుష్టు నివారణకు పటిష్ట చర్యలు

ప్రజాశక్తి - రాయచోటి

జిల్లాలో కుష్టు వ్యాధి నివారణకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని కుష్ఠు వ్యాధి విభాగం జిల్లా అధికారి డాక్టర్ శైలజ వైద్య సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం రాయచోటిలోని వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో కుష్ఠు వ్యాధి విభాగం జిల్లా అధికారి, డాక్టర్ సౌజన్య తన సిబ్బందితో నెలవారి సమీక్షా సమావేశం నిర్వహించారు. డాక్టర్ శైలజ మాట్లాడుతూ జిల్లాలో కుష్టు, క్షయ వ్యాధి నివారణకు ఒక కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలన్నారు. వైద్య సిబ్బంది కుష్టు, క్షయ వ్యాధులపై అవగాహన కార్యక్రమాలు ముమ్మరంగా చేపట్టడంతో పాటు విరివిగా వైద్య పరీక్షలు నిర్వహించాలని సూచించారు. రాబోయే రోజుల్లో ఈ వ్యాధులు ప్రబలకుండా గట్టి చర్యలు చేపట్టాలన్నారు. అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఉప ఆరోగ్య కేంద్రాలలో కుష్టు, క్షయ వ్యాధుల నివారణకు వైద్య పరీక్షలు, చికిత్సలు చేపట్టాలన్నారు. అన్ని విద్యాసంస్థల్లోనూ కుష్టు, క్షయ వ్యాధుల నివారణపై అవగాహన కార్యక్రమాలు విరివిగా చేపట్టాలని తద్వారా విద్యార్థుల కుటుంబ సభ్యులు ఆరోగ్యంపై దృష్టి కేంద్రీకరించే అవకాశం ఉందన్నారు. గ్రామాల్లో విరివిగా గ్రామసభలు సర్పంచ్లు ఆధ్వర్యంలో నిర్వహించి వ్యాధుల నివారణపై ప్రజలకు అవగాహన కలిగించాలన్నారు. వ్యాధి లక్షణాలున్న వారిని పరీక్షించి తగిన విధంగా చికిత్స అందించాలన్నారు. ప్రాథమిక దశలోనే కుష్ఠు సోకినా వారిని గుర్తించి చికిత్స అందించడం వల్ల అంగవైకల్యం నివారించ వచ్చుని, అలాగే కుష్ఠు వ్యాధి వ్యాప్తిని అరికట్ట వచ్చుని తెలిపారు. కుష్ఠు వ్యాధికి ప్రజలు భయపడవలసిన అవసరం లేదని, 6 నెలలు లేదా సంవత్సర కాలం మందులతో ఏ దశలోనైనా కుష్ఠు వ్యాధి పూర్తిగా నయమవుతుందని తెలిపారు. 2023 డిసెంబర్ చివరినాటికి జిల్లా వ్యాప్తంగా పాఠశాలలో కుష్టు వ్యాధి గుర్తింపు కోసం సర్వే నిర్వహించాలని, అంగవైకల్యం కలిగి సరి చేయడానికి అవకాశం ఉన్న వారిని గుర్తించి సర్జరీ చేయించాలని చెప్పారు. అంతేకాక కుష్టి వ్యాధి వల్ల వైకల్యం కలిగిన వారి అందరిని గుర్తించి నమోదు చేసుకోవాలని సిబ్బందిని కోరారు. సమావేశంలో పారామెడికల్ అధికారి రవి కుమార్, ఫిజియోతెరపిస్ట్ గుర్రప్ప, హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ దేవ ప్రసాద్, డిప్యూటీ పారామెడికల్ అధికారి శంభు ప్రసాద్,ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ప్రేమాలయంలో అన్నదానం

ప్రజాశక్తి-సుండుపల్లి

కాపు సంక్షేమ సేన ఏర్పడి మూడేళ్లు పూర్తయిన సందర్భంగా మంగళవారం స్థానిక ప్రేమాలయం ఆశ్రమంలో కాపు సంక్షేమ సేన మహిళా అధ్యక్షులు రెడ్డిరాణి, హరిరామజోగయ్య ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హరిరామజోగయ్యను స్ఫూర్తిగా సేవా కార్యక్రమాలు చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో కాపు సంక్షేమ సేన అన్నమయ్య జిల్లా ఉపాధ్యక్షుడు బుడ్డా బాబు, కాపు యువసేన ప్రధాన కార్యదర్శి రెడ్డి ప్రసాద్, కాపు సంక్షేమ సేన నాయకులు పాల్గొన్నారు.


అన్నదానం చేస్తున్న రెడ్డి రాణి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి

ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం : 'మేడా'

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

రాష్ట్ర ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే మేడా మల్లిఖార్జునరెడ్డి, జడ్‌పి చైర్మన్ ఆగేపాటి అమర్నాథ్‌రెడ్డి తెలిపారు. మంగళవారం నా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే మల్లిఖార్జునరెడ్డి తన కార్యాలయంలో మంగళవారం జెసిఎస్ కన్వీనర్లు, ఇన్‌ఛార్జులతో జెసిఎస్ నమోదు శిబిరం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, మురళిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేడా, ఆకేపాటి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని పేర్కొన్నారు. సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చి సంక్షేమ పథకాలను ప్రజల ముంగిటికే తీసుకొచ్చారని తెలిపారు. గత ప్రభుత్వాలను పోల్చుకుని జగన్మోహన్‌రెడ్డి సంక్షేమ పాలనను ప్రజలు గుర్తించాలని తెలిపారు. ఇటీవల నియోజకవర్గస్థాయిలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమాలలో జెసిఎస్ కన్వీనర్లు కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. కన్వీనర్లకు అనారోగ్య సమస్యలు తలెత్తినా, ప్రమాదం వాటిల్లినా రూ.10 లక్షలు బీమా వర్తిస్తుందని, సంబంధిత పత్రాలను జెసిఎస్ కన్వీనర్లకు త్వరలోనే అందించడం జరుగుతుందని తెలిపారు. రాబోయే ఎన్నికలలో అవకతవకలకు చోటు లేకుండా ఓటర్ల జాబితాలు సక్రమంగా ఉండేలా అధికారులు చొరవ చూపాలన్నారు. కార్యక్రమానికి ఆరు మండలాల నుంచి పాల్గొన్న జెసిఎస్ కన్వీనర్లు, వైసిపి నాయకులకు మేడా మల్లిఖార్జున రెడ్డి భోజన వసతి కల్పించారు. కార్యక్రమంలో వైసిపి కన్వీనర్ల ఇన్‌ఛార్జులు, మండల అధ్యక్షులు జడ్‌పిటిసి, ఎంపిటిసిలు, సర్పంచులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు గడప గడపకూ మన ప్రభుత్వం

రామాపురం : బుధరవారం నుంచి రెండు రోజు లపాటు మండలంలోని నల్లగుట్టపల్లెపరిధిలో గడపగడప కార్యక్రమం నిర్వహించనున్నట్లు లక్కిరెడ్డిపల్లె మార్కెట్ యార్డ్ చైర్మన్ కర్ణపు విశ్వనాథరెడ్డి, నల్లగుట్ట పల్లి గ్రామ సర్పంచ్ అయోధ్య పురం నాగభూషణ్ రెడ్డి సంయుక్త ప్రకటనలో తెలిపారు. నల్లగుట్టపల్లి గ్రామంలోని ఉదయం 6 గంటల నుంచి కర్ణపువాండ్లపల్లి, రామాపురం, కొత్తపల్లి బీసీ కాలనీ, హరిజనవాడ, రాచపల్లి తదితర ప్రాంతాల్లో రాయచోటి శాసనసభ్యులు గడికోట శ్రీకాంత్ రెడ్డి పర్యటిస్తారన్నారు. కార్యక్రమానికి మండలంలోని వైసిపి కార్యకర్తలు, అధికారులు తప్పక హాజరుకావాలని పేర్కొన్నారు.

ఆర్థికంగా బలోపేతం కావాలి : జిఎం

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

పారిశుధ్య కార్మిక కుటుంబాలు ఆర్థికంగా బలోపేతం కావాలని అన్నమయ్య జిల్లా పరిశ్రమల శాఖ అధికారి నాగరాజు అన్నారు. పారిశుధ్య కార్మిక కుటుంబాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న రుణాలు, రాయితీ పై కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం మెప్మా కార్యాలయంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పారిశుధ్య కార్మిక కుటుంబాలు ఆర్థికంగా బలపడాలనే ఉద్దేశంతో చిన్న చిన్న పరిశ్రమలు దుకాణాలు ఏర్పాటు చేసుకున్న వారికి రాయితీతో కూడిన రుణాలు అందిస్తుందని చెప్పారు. ఆహార తయారీ యూనిట్ల ద్వారా తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు సాధ్యమవుతాయని అన్నారు. బ్యాంకుల ద్వారా రాయితీతో కూడిన రుణాలు పొందవచ్చని సూచించారు. అనంతరం ఆర్థికంగా బలోపేతం అవడం కోసం పరిశ్రమల శాఖ అందిస్తున్న రాయితీల గురించి వివరించారు. మున్సిపల్ పారిశుధ్య విభాగంలో పనిచేస్తున్న కార్మికులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ గంగా ప్రసాద్, జిల్లా ఉద్యనవనశాఖ అధికారి రవిచంద్ర, ఎల్‌డిఎం వెంకటేశ్వర రెడ్డి, మున్సిపల్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మల్లికార్జున, మెప్మా అధికారి అబ్బాస్, ఉద్యానవన శాఖ మారుతి, మున్సిపల్ సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పరిశ్రమల శాఖ అధికారి


శిక్షణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న మాజీ సిఎం కిరణ్‌కుమార్‌రెడ్డి

సిఆర్‌పిఎఫ్ శిక్షణ కేంద్రాన్ని పరిశీలించిన మాజీ సిఎం 'నల్లారి'

కలికిరి: సిఆర్‌పిఎఫ్ శిక్షణ కేంద్రాన్ని మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్ కుమార్‌రెడ్డి మంగళవారం సందర్శించారు. సిఆర్‌పిఎఫ్ కమాండెంట్ రాజేష్ కుమార్ ఆహ్వానం మేరకు మొట్ట మొదటి సారి కిరణ్ కుమార్‌రెడ్డి సిఆర్‌పిఎఫ్ క్యాంపుకు చేరుకోగా ఘన స్వాగతం పలికారు. సిఆర్‌పిఎఫ్ క్యాంప్ ఆఫీసులో కిరణ్ కుమార్‌రెడ్డితో శిక్షణ కేంద్రం అభివృద్ధి గురించి కమాండెంట్ రాజేష్ కుమార్ వివరించారు. శిక్షణ కేంద్రం ఏర్పాటుకు స్థలం ఇచ్చినందుకు కిరణ్‌కు ప్రత్యేక అభినందనలు తెలిపారు. సిఆర్‌పిఎఫ్ క్యాంపలో కేంద్రీయ విశ్వ విద్యాలయం ఏర్పాటు కొరకు కేంద్రం దృష్టికి తీసుకెళ్లాలని కిరణ్‌కు కమాండెంట్ వినతి పత్రం అందించారు. అనంతరం క్వార్టర్ గార్డు వద్ద సిఆర్‌పిఎఫ్ సిబ్బందిచే కిరణ్ కుమార్‌రెడ్డి గౌరవ వందనం స్వీకరించారు. క్వార్టర్ గార్డును పరిశీలించి విజిటింగ్ రికార్డులలో సంతకం చేశారు. సిఆర్‌పిఎఫ్ కేంద్రానికి వచ్చే యువకులకు మంచి శిక్షణ ఇవ్వాలని కమాండెంట్ రాజేష్ కుమార్‌కు సూచించారు. కార్యక్రమంలో కిరణ్‌కుమార్‌రెడ్డి కుమారుడు నల్లారి నిఖిలేష్‌రెడ్డి, మాజీ ఎంపిపి నల్లారి ఆనంద్‌రెడ్డి, పలవలి రెడ్డప్పరెడ్డి, శ్రీధర్‌రెడ్డి, ప్రముఖ కాంట్రాక్టర్ శేష కుమార్‌రెడ్డి, సహదేవరెడ్డి పాల్గొన్నారు.

జెవివి జిల్లా యూత్ కన్వీనర్‌గా వినయ్‌కుమార్


వినయ్‌కుమార్

రాయచోటి: జన విజ్ఞాన వేదిక జిల్లా రెండో మహాసభలో యూత్ కన్వీనర్‌గా వినయ్ కుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నిక చేసుకున్నట్టు జన విజ్ఞానం వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రకాష్‌రెడ్డి మంగళవారం తెలిపారు . ఈ సందర్భంగా వినయ్ కుమార్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి జిల్లా యూత్ కన్వీనర్ గా ఎన్నుకోవడం చాలా సంతోషంగా ఉందని సైన్స్‌కు ఉపయోగపడే అవగాహన సదస్సులు , యువతలో చైతన్య పరిచే కార్యక్రమాలు, సైంటిఫికల్ ప్రాజెక్ట్ ఎక్స్‌పో, మొక్కలు నాటడం వంటి కార్యక్రమాలతో నూతన కార్యచరణ తో పూర్తి స్థాయిలో కార్యక్రమాలు చేస్తామని తెలిపారు. ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు గాను జనవిజ్ఞాన వేదిక జిల్లా కమిటీకి కృతజ్ఞతలు తెలిపారు.

తప్పుల్లేని ఓటర్ల జాబితా తయారు చేయాలి

ప్రజాశక్తి - రాయచోటి

జిల్లాలో తప్పులు లేని ఓటురు జాబితా రూపొందించడం లక్ష్యం కావాలని కలెక్టర్ గిరీష సంబంధిత అధికారులకు సూచించారు. మంగళవారం రాయచోటి పట్టణంలోని మాసాపేట, మార్కెట్ వీధులలో కలెక్టర్ ఇంటింటికి వెళ్లి ఓటరు జాబితాను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటరు జాబితాలో ఎటువంటి చిన్న పొరపాటు ఉండరాదన్నారు. తప్పులు లేని స్వచ్ఛమైన ఓటరు జాబితా రూపొందించడం వల్ల ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించడానికి అవకాశముంటుందని చెప్పారు. ఇందుకు సంబంధించి ఇప్పటి నుంచే బిఎల్‌ఒలు ఒకటికి రెండుసార్లు ఇంటింటికి వెళ్లి తప్పులు లేని ఓటర్ జాబితా రూపకల్పనకు కృషి చేయాలన్నారు. అనంతరం కలెక్టర్ సంబేపల్లి మండలంలోని ముద్దినేనివాండ్ల పల్లెలో ఇంటింటికి వెళ్లి ఓటర్ జాబితాను పరిశీలించారు. కార్యక్రమంలో రాయచోటి తహసిల్దార్ ప్రేమంత్ కుమార్, సంబేపల్లి తహసిల్దార్ మహేశ్వరి బాయ్, ఎలక్షన్ డిప్యూటీ తహశీల్దార్ నరసింహులు, బిఎల్‌ఒలు రాధమ్మ, యుగంధర్ పాల్గొన్నారు.


మాసాపేటలో ఓటర్ల జాబితా పరిశీలన చేస్తున్న కలెక్టర్ గిరీష



మాట్లాడుతున్న ఎంపిపి లక్ష్మీనరసమ్మ

పల్లెబాటను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - బి.కొత్తకోట

గ్రామీణ ప్రాంతాల్లో సమస్యల పరిష్కారమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పల్లెబాట కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వైసిపి ప్రజాప్రతినిధులు, అధికారులు పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని గట్టు పంచాయతీ చలిమామిడి, బలసరపెంట, బురుజుపల్లి గ్రామాలలో పల్లెబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరుపేదల సంక్షేమం, అభ్యున్నతి కోరకు ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారన్నారు. సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చి ప్రభుత్వ సంక్షేమ పథకాలను నేరుగా లబ్ధిదారులకు అందజేస్తున్నారన్నారు. నవరత్నాలు సంక్షేమ పథకాలతో నిరుపేద, సామాన్య కుటుంబాల్లో ముఖ్యమంత్రి వెలుగులు నింపుతున్నారన్నారు. వీటిని దృష్టిలో ఉంచుకొని ప్రజలు మరోసారి వైసిపిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మండల ఎంపిపి లక్ష్మీ నరసమ్మ, గట్టు సర్పంచ్ ఉమామహేశ్వరి లక్ష్మీనారాయణ గట్టు ఉమ్మడి మాజీ సర్పంచ్ మీయా సాబ్, గట్టు సచివాలయం కన్వీనర్ సికిందర్ బాషా, బయ్యారెడ్డి, పి.ఖాదర్ వల్లి, గట్టు ఆర్బికె చేర్మన్ దామోదరరెడ్డి, రంగారెడ్డి, అమరనాథ్‌రెడ్డి, రమణారెడ్డి, సంఘమిత్ర గోవర్ధన్‌రెడ్డి, యుగంధర్‌రెడ్డి, బర్గిపల్లి నారాయణ, రమణ, బలసరపెంట జయన్న, నరసింహులు, గట్టు పార్టీ శీన, ఎంపిడిఒ శంకరయ్య, వైసిపి నియోజకవర్గ సోషల్ మీడియా కో-కన్వీనర్ తన్వీర్ పాల్గొన్నారు.

ఓటర్ల పరిశీలన పారదర్శకంగా చేపట్టాలి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ఒక గ్రామానికి కేటాయించిన బిఎల్ఒ గ్రామానికి వెళ్లి ఆధార్ కార్డును పరిశీలించి, వ్యక్తి గ్రామంలో ఉన్నారా లేదా అని నిర్ధారించుకుని, పక్కాగా, పారదర్శకంగా ఓట్ల పరిశీలన చేపట్టాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ పూల భాస్కర్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ నియోజకవర్గంలోని వెంకట రాజంపేట 189 పిఎస్‌కు సంబంధించి సుమారు 742 ఓట్లు ఉన్నాయని, అయితే పక్క గ్రామమైన ఊటుకూరు ఓటర్లను ఇపిఎస్‌లో నమోదు చేసి తారుమారు చేశారని ఆరోపించారు. సీరియల్ నెంబర్ 524, 525 సంబంధించిన ఎం.బి రమణ, సూరవు రాజు రమేష్ కుమార్ రాజుల ఓట్లు తారుమారు చేసి 189 పిఎస్‌లో నమోదు చేశారన్నారు. ప్రతిపక్షాలు కేంద్ర ఎన్నికల కమిషన్ వద్దకు వెళ్లి దొంగ ఓట్లు ఎక్కువగా గగ్గోలు పెడుతున్నా ఫలితం లేకుండా పోయిందని అన్నారు. నియోజకవర్గంలోని ఒక పిఎస్‌లోని పక్క గ్రామం ఓట్లు నమోదు చేశారంటే రాష్ట్ర వ్యాప్తంగా ఎన్ని లక్షల దొంగ ఓట్లు నమోదై ఉన్నాయో అర్థం చేసుకోవచ్చునని తెలిపారు. దీనిపై ఎన్నికల కమిషన్ స్పందించి ఓట్లు తారుమారు కాకుండా, దొంగ ఓట్లు నమోదు కాకుండా సత్వర చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.



ఎంపిడిఒ సౌభాగ్యమ్మకు వినతిపత్రం ఇస్తున్న కాలనీ వాసులు

తాగునీటి సమస్య పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి-నందలూరు

మండలంలోని నల్లతిమ్మాయపల్లె గ్రామ పంచాయతీ పరిధిలోని సబ్‌స్టేషన్ సమీపంలోని ఎస్సీ కాలనీలలో మూడు రోజులుగా మంచినీరు సరఫరా సక్రమంగా జరగకపోవడంతో అనేక ఇబ్బందులకు గురవుతున్నామని, ఆయా కాలనీల ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం స్థానిక ప్రజలు ఎంపిడిఒ కార్యాలయానికి పెద్ద ఎత్తున తరలివచ్చి ఎంపిడిఒ సౌభాగ్యమ్మకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నల్లతిమ్మాయపల్లె కాలనీ ప్రజలు మాట్లాడుతూ గ్రామ సమీపంలోని చెయ్యేరులో ప్రభుత్వం మంచినీరు పైప్ లైన్ ఏర్పాటు చేసి తమ కాలనీలకు తాగునీరు వచ్చే ఏర్పాటు చేశారని, అయితే కొంతమంది ప్రభుత్వ భూములను ఆక్రమించి అందులో చెట్లను నాటి మంచినీరు అందించే పైపుల ద్వారా ఆ చెట్లకు నీరు మరలిస్తున్నారని దీనివలన తమకు తాగునీరు సరఫరా కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మరి కొంతమంది ఇండ్లలోని చెట్ల కొరకు తమకు సరఫరా అయ్యే మంచినీటి పైపు నుండే నీరును మరలించడం వల్ల తాగునీటికి అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. మండల అధికారులు వెంటనే స్పందించి తమ సమస్యను పరిష్కరించాలని కోరారు. వెంటనే స్పందించిన ఎంపిడిఒ సమస్యను పరిష్కరించాలంటూ ఇఒపిఆర్‌డి, పంచాయతీ కార్యదర్శులకు ఆదేశించారు. కార్యక్రమంలో స్థానిక కాలనీవాసులు మణ్యం మల్లేశ్వరరెడ్డి, గట్టుపల్లె సాంబశివారెడ్డి, బయన బోయిన వెంకటసుబ్బయ్య, కత్తి శ్రీనివాసులు, తుంటి సుబ్బరాయుడు, జి.ప్రసాద్, బి.కృష్ణమ్మ,గాడి రెడ్డమ్మ, టి.వెంకటమ్మ, జి.రమాదేవి, కత్తి నరసమ్మ, ఎం.లక్ష్మీదేవి పాల్గొన్నారు.

అరవపల్లెలో విద్యుత్ దాడులు

ప్రజాశక్తి-నందలూరు



విద్యుత్ మీటర్లను పరిశీలిస్తున్న సిబ్బంది

మండలంలోని నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతీ అరవపల్లెలో విద్యుత్ అధికారులు దాడులు నిర్వహించారు. ఎస్ఎఇ మాధవ్ కుమార్, ఎఎఇ శివకుమారి, జెఎఇఎఎస్ శర్మల ఆధ్వర్యంలో పేరుకుపోయిన విద్యుత్ బకాయలపై దాడులు నిర్వహించి, వారి విద్యుత్ కనెక్షన్ తొలగించారు. విద్యుత్ బిల్లులు చెల్లించని వారి దాదాపు 20 కనెక్షన్లను కట్ చేశారు. కార్యక్రమంలో విద్యుత్ ఎఇ బాలసుబ్రమణ్యం, లైన్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు, లైన్ మెన్ శ్రీరామ్ కిరణ్ కుమార్, జెల్ఎం కృష్ణ పాల్గొన్నారు.

వ్యవహారిక భాషకు ప్రతీక 'గిడుగు' : జెసి



రామ్మూర్తి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జెసి ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

ప్రజాశక్తి- రాయచోటి

వ్యవహారిక తెలుగు భాషకు వెలుగు ప్రతీక గిడుగు రామ్మూర్తి అని జెసి ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ కొనియాడారు. మంగళవారం కలెక్టరేట్‌లో గిడుగు రామ్మూర్తి జయంతి పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి జెసి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలుగు వాడుక భాషా ఉద్యమ పితామహుడు గిడుగురామ్మూర్తి అన్నారు. తెలుగు భాషకు తొలి అడుగు గిడుగు రామ్మూర్తి అన్నారు. తెలుగు భాష ఉన్నంతవరకు గిడుగు రామ్మూర్తి చిరస్మరణీయునిగా ఉంటారన్నారు. తెలుగు సాహిత్యాన్ని సరళీకరించి, తెలుగు భాష తీయదనాన్ని సామాన్యుడికి చేరువ చేసిన రామ్మూర్తి పంతులు, తెలుగుభాషా సంస్కర్తల్లో అగ్రగణ్యులుగా నిలిచారన్నారు. కార్యక్రమంలో గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి కలెక్టరేట్ ఎఒ బాలకృష్ణ, పర్యాటక శాఖ జిల్లా అధికారి నాగభూషణం, సమాచార శాఖ డిపిఆర్ఒ భరత్ కుమార్ రెడ్డి, కలెక్టరేట్ సిబ్బంది నివాళులు అర్పించారు. **రామాపురం :** మండలంలోని ఆదర్శ పాఠశాలలో మంగళవారం గిడుగు రామమూర్తి జయంతి ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ శ్యామలాదేవి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థుల ఉద్దేశించి మాట్లాడుతూ గిడుగు రామ్మూర్తి పుట్టినరోజు సందర్భంగా సాంప్రదాయ దుస్తులతో విద్యార్థులు చూడ ముచ్చటగా కనిపించారని అన్నారు. ప్రతి ఒక్కరూ తెలుగు భాష ప్రాముఖ్యతను తెలుసుకోవాలన్నారు. దేశ భాషలందు తెలుగు లెస్స అని శ్రీకృష్ణదేవరాయుడు అప్పట్లోనే తెలుగు భాష గొప్పదనాన్ని వివరించారని ఆమె అన్నారు మాతృభాష పట్ల నిర్లక్ష్యం వహించరాదని సూచించారు అనంతరం మేజర్ ధ్యాన్ చంద్ పుట్టినరోజు సందర్భంగా క్రీడా పోటీలు నిర్వహించి గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది విద్యార్థినులు పాల్గొన్నారు. **గాలివీడు :** మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం తెలుగు భాషా, జాతీయ క్రీడా దినోత్సవాలను నిర్వహించారు. ధ్యాన్‌చంద్, గిడుగు రామ్మూర్తి చిత్రపటాలకు పూలమాల వేసి నివాళు లర్పించారు. విద్యార్థులతో సాంస్కృతి కార్యక్రమాలు, క్విజ్ పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

రాజంపేట అర్బన్ : జన్మనిచ్చిన మాతృ మూర్తిని, మన మాతృభాషను మరచి పోకూడదని కొత్త బోయినపల్లి ప్రధానోపాధ్యాయులు కె.భారతి అన్నారు. కొత్త బోయినపల్లి ఎస్.జె.ఎస్.ఎం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు భాషా ఉపాధ్యాయులు మజ్జారి చెన్న కేశవులు, పిఎల్ఎన్‌వి ప్రసాద్ రావు ఆధ్వర్యంలో మాతృభాషా దినోత్సవ కార్యక్రమం, భారత హాకీ క్రీడాకారుడు ధ్యాన్ చంద్ గౌరవ సూచకంగా జాతీయ క్రీడా దినోత్సవాన్ని పిఇటి ఎన్.అమరావతి, పీడీ ఈశ్వర్‌నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించారు. గిడుగు వెంకట రామ్మూర్తి, ధ్యాన్ చంద్ చిత్ర పటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు టిఎండి షఫీ, దండు సుబ్బారెడ్డి, ఎస్‌వి.రామరాజు, కె.వి.రమణనాయుడు, పి.జనార్ధన్, ఎ.శివ ప్రసాద్, ఎస్.ప్రభాకర్ రావు, పి.విజయభాస్కర్, రెడ్డి బాబు, బి.శేషగిరి, దార్ల శ్రీనివాసులు ఆచారి, శారదా, డి.శ్రీలత, అమరావతి పాల్గొన్నారు. **బి.కొత్తకోట :** వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సవాన్ని ఎంఆర్‌సిలో ఎంఇఒ రెడ్డి శేఖర్ ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. గిడుగు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వాకర్స్ ప్రతినిధి ఎన్.క్రిష్ణారెడ్డి, నాగభూషణం, ఓలేటి శంకర, దేసు నరసింహులు, రాజశేఖర్, కృష్ణమూర్తి, లక్ష్మినారాయణ, గోపాలకృష్ణ, ఎంఆర్‌సి సిబ్బంది నరసింహులు, రమేష్, భవిత కేంద్రం ఉపాధ్యాయులు పోలయ్య, నక్క మహేష్ పాల్గొన్నారు. **నందలూరు :** హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్ చంద్, వ్యవహారిక భాషా ఉద్యమ పితామహుడు గిడుగు వెంకట రామమూర్తి పంతులు జయంతులను పురస్కరించుకొని మండలంలోని నాగిరెడ్డిపల్లి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో క్రీడా, తెలుగు భాషా దినోత్సవాలను ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జయలలిత కుమారి, మండల విద్యాశాఖ అధికారులు నాగయ్య, అనంతకృష్ణ ఆధ్వర్యంలో వ్యాయామ ఉపాధ్యాయురాలు గౌరీ, తెలుగు ఉపాధ్యాయులు గంగనపల్లె వెంకటరమణ, గీత, రమణమ్మలు ఈ కార్యక్రమాలను జరిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన, పద్యపఠన పోటీలు, సామెతలు, కథల పోటీలు నిర్వహించి ప్రతిభ చూపిన విద్యార్థినీ విద్యార్థులకు బహుమతులను అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఖాదర్ బాషా, డాక్టర్ నాగేంద్ర ప్రసాద్, బోగా వెంకటసుబ్బయ్య, లక్ష్మీనారాయణ, రవి శంకర్ రెడ్డి, మస్తాన్, వెంకటరమణ, ప్రసాదరావు, స్వర్ణలత, రమణమ్మ, విజయ కుమారి, ప్రమీల రహేల్, పెంచలయ్య పాల్గొన్నారు. **కలకడ :** ఆదర్శ పాఠశాలలో గిడుగు రామ్మూర్తి పంతులు జయంతి సందర్భంగా తెలుగు భాషా దినోత్సవం, ధ్యాన్చంద్ జయంతి సందర్భంగా జాతీయ క్రీడా దినోత్సవంను అత్యంత ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల కమిటీ చైర్మన్ మస్తాన్ అహ్మద్, తెలుగు ఉపాధ్యాయులు షాకిర్, ప్రసాద్, రాజేష్, వ్యాయామ దర్శకులు కరుణాకర్, ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ చంద్రశేఖర్ పాల్గొన్నారు. **రాజంపేట అర్బన్ :** విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు సాధ్యమని శ్రీ చైతన్య పాఠశాల ప్రిన్సిపల్ ఆకేపాటి సుధాకర్‌రెడ్డి అన్నారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా భువనగిరి పల్లి ఆర్చి వద్ద ఉన్న శ్రీ చైతన్యలో ఉమ్మడి జిల్లా ఎజిఎం రమణయ్య ఆధ్వర్యంలో అట్టహాసంగా స్పోర్ట్స్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులను ప్రదానం చేశారు. **రామసముద్రం :** మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఆదర్శ పాఠశాలలో ఘనంగా తెలుగు భాష దినోత్సవ వేడుకలు నిర్వహించారు. తెలుగుతల్లి విగ్రహానికి పూలమాలలు వేసి తెలుగు భాష దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ మురళీధర్, అధ్యాపకులు పాల్గొన్నారు. **పీలేరు:** తెలుగు భాషకు ఎంతో ఔనత్యం, గుర్తింపు ఉన్నాయని తెలుగు భాషోద్యమ నాయకులు మునస్వామి తెలిపారు. తెలుగు భాషా సమితి సారధ్యంలో గిడుగు రామమూర్తి పంతులు జయంతిని విఎస్ఎన్ సిద్ధార్థ పాఠశాల వ్యవస్థాపకుడు వడ్లమూడి శ్రీనివాసుల నాయుడు, కరెస్పాండెంట్ వడ్లమూడి మాధవి అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమంలో రత్నాకరంరెడ్డి శేఖర్‌రాజు, సరస్వతి శ్రీరాములురాజు, జలకనూరి మురళీధర్‌రాజు, శ్రీచైతన్య కళాశాల ప్రధానాచార్యులు నాగార్జునరెడ్డి, యోగా లక్ష్మీ, తెలుగు ఉపాధ్యాయులు చలపతి నాయుడు, సురేంద్ర, బాబూ నాయక్ విద్యార్థులు పాల్గొన్నారు. **కలికిరి:**మండలంలో అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ఘనంగా తెలుగు దినోత్సవం నిర్వహించారు. స్థానిక రెడ్డివారిపల్లిలోని తపస్య విద్యాసంస్థలో తెలుగుభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ రామాంజులు నాయుడు, ప్రిన్సిపల్ శివప్రసాద్, తెలుగు ఉపాధ్యాయులు రెడ్డెప్ప, ప్రధానోపాధ్యాయులు మాధవి, ప్రేమలత, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు. **పుల్లంపేట :** మండల పరిధిలోని టి.కమ్మపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ క్రీడా, తెలుగు భాష దినోత్సవం పాఠశాల ప్రధానోపాధ్యాయులుసబితా ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో హిందీ ఉపాధ్యాయుడు సయ్యద్ సర్తాజ్ హుస్సేన్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజలకు మంచి చేయడమే ప్రభుత్వ లక్ష్యం

ప్రజాశక్తి-నిమ్మనపల్లె



సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా

ప్రజలకు మంచి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే నవాజ్ భాష అన్నారు. మంగళవారం సాయంత్రం నిమ్మనపల్లి పంచాయతీలోని నిమ్మనపల్లి, గంగాపురంపల్లి, తిమ్మాపురం, జల్లావారిపల్లె గ్రామాలలో వైఎస్ఆర్సిపి నాయకులు విజయ్ కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ఎంపిపి నరసింహులు, సింగిల్ విండో అధ్యక్షులు రెడ్డిశేఖర్‌రెడ్డి, మండల వైసిపి ఇన్‌ఛార్జి ఆర్ఐ రమణారెడ్డి, మండల సచివాలయాల కన్వీనర్ రామమోహన్ రెడ్డి, వైస్ ఎంపిపి జయప్రకాశ్ రెడ్డిలతో కలసి ఇంటింటికి వెళ్లారు. ప్రజల యోగక్షేమాలను విచారిస్తూ గత నాలుగేళ్లుగా ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను వివరించారు. సంక్షేమ పథకాల ద్వారా పొందిన లబ్ది కి సంబంధించిన బుక్‌లెట్‌ను అందించారు. స్థానిక సమస్యలను గ్రామస్థులతో మాట్లాడి తెలుసుకున్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా స్థానికులు పించన్లు, రోడ్లు, మురుగునీటి కాలువల నిర్మాణం, విద్యుత్ స్తంభాలు ఏర్పాటు, రెవెన్యూ సమస్యలను సైతం ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారని పేర్కొన్నారు. ఎమ్మెల్యే స్పందిస్తూ వెంటనే సమస్యలు పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నవాజ్‌బాషా మాట్లాడుతూ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజలకు ఏ విధంగా మేలు చేయాలో ఆలోచిస్తూ ముందుకెళుతున్నట్లు చెప్పారు. ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చిన మేరకు నవరత్న సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు అన్ని విధాల మేలు చేకూర్చుతున్నట్లు తెలిపారు. ప్రజలు సంక్షేమ పథకాలతో సంతోషంగా ఉన్నారన్నారు. సంక్షేమ పథకాలను నేరుగా లబ్ధిదారులకు చేరుస్తున్నారన్నారు. ప్రజలు సంతోషంగా ఉండడం ప్రతిపక్ష పార్టీలకు ఇష్టం లేక, సంక్షేమ పాలనను జీర్ణించుకోలేక ప్రజలను తప్పుదోవ పట్టించడానికి, ప్రభుత్వంపై పసలేని విమర్శలు చేస్తూ, ప్రజలను మభ్య పెట్టేందుకు ప్రయత్నిస్తున్నారు. మండలంలోని ప్రతి ఇంటిలోని లబ్ధిదారులను గడపగడప కార్యక్రమం ద్వారా నేరుగా పలకరించడం జరిగిందన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న వైఎస్ఆర్సిపి ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి ప్రజలు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో మండల కో-ఆప్షన్ సభ్యులు మహ్మద్‌రఫీ, సర్పంచులు సుబ్రమణ్యం, చంద్రాయుడు, మహాదేవరెడ్డి, వైసిపి నాయకులు చంద్రమోహన్, నరేంద్రరెడ్డి, శశిధర్‌రెడ్డి, యుగంధర్‌రెడ్డి, సివి.రమణారెడ్డి, నవీన్, హోటల్ రఫీ, ప్రభుత్వ అధికారులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

పిఎం కిసాన్ లబ్ధిదారులను ఎంపిక చేయండి

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని రైతులకు పిఎం కిసాన్ డబ్బులు పడని వారి వివరాలు ఆధారంగా వారిని పరిశీలించి వారి పేరుతో భూమికి ఆధార్ లింక్ అయినదా లేదా, భూమి ఆన్‌లైన్‌లో ఒకరి పేరు ఉండి ఆధార్ కార్డు మరొకరిది లింక్ అయి ఉంటే అలాంటివి పరిశీలించి చనిపోయిన వారి పేరుతో పిఎం కిసాన్ పడుతూ ఉంటే అలాంటి వారిని గుర్తించి పరిశీలించి తొలగించాలని తహశీల్దార్ నరసింహ కుమార్ మంగళవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో మండల రెవెన్యూ అధికారులు, వ్యవసాయ శాఖ అధికారి కృష్ణ చైతన్య ఆధ్వర్యంలో పలు సూచనలు సలహాలు అందించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నవీన్, వీఆర్వోలు ధనమ్మ, రాధమ్మ, సోమశేఖర్ రెడ్డి, ముజీబ్, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

తంబళ్లపల్లె: అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీపీ అనసూయమ్మ తెలిపారు. మంగళవారం గోపిదీన్నే పంచాయితీలో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకానాథ్‌రెడ్డి ఆదేశాల మేరకు సర్పంచ్ సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో పల్లెబాట కార్యక్రమం జరిగింది. ప్రతి పల్లెలో ప్రతి ఇంటికి వెళ్లి సంక్షేమ పథకాలు అమలుపై చేరిన లబ్ది సమాచారంపై వివరించారు. ఇప్పటికీ ఉన్న సమస్యలపై అడిగి తెలుసుకున్నారు. హరిజనవాడలో మురికినీటి కాలువలు ఏర్పాటు చేయాలని రాగి మాని దీన్నే పల్లెలో సిసి రోడ్డు నీటి ట్యాంకు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరారు ఎండ్లవాండ్ల పల్లెకు లింక్ రోడ్డు రోడ్డు ఏర్పాటు చేయాలని కోరారు. చరిత్రలో ఇప్పటివరకు ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా అభివృద్ధి, సంక్షేమ రెండు కళ్ళుగా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పాలన సాధిస్తున్నారన్నారు. ప్రతి నిరుపేద కుటుంబంలోనూ ఆర్థిక వెసులుబాటు కల్పించేందుకు ఈ సంక్షేమ పథకాలు దోహదపడుతున్నాయన్నారు. గ్రామీణ ప్రజలకు అత్యవ సరమైన విద్యా, వైద్య రంగాలపై ప్రత్యేక దృష్టి సాధించి సేవలో అందించడం వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కిందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ సురేంద్రనాథ్, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ నారాయణరెడ్డి, సింగల్ విండో చైర్మన్ భార్గవరెడ్డి, ఎంపీడీవో సురేంద్రనాథ్, ఎపిఒ అంజనప్ప, ఎపిఎం గంగాధర్, నాయకులు శివారెడ్డి, రెడ్డప్ప, రంగారెడ్డి, కోటిరెడ్డి, వైవి రమణారెడ్డి, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా వెలుగు వ్యవస్థాపకులు పద్మజ వర్ధంతి

మదనపల్లె అర్బన్: మండలంలోని కోళ్లబైలు పంచాయితీ, అమ్మచెరువు మిట్టనందు వెలుగు సంస్థ యొక్క వ్యవస్థాపకులు, మదనపల్లె మదర్ థెరిసా స్వర్గీయ పద్మజ 19వ వర్ధంతి కార్యక్రమం మంగళవారం ఘనంగా నిర్వహించుకున్నారు. దివ్యాంగుల జీవితాల్లో వెలుగు నింపాలనీ వికలాంగులను కూడా సకలాంగులుగా సమాజంలో సమన్వయం చేయాలనే తపనతో వారి సంక్షేమం కొరకై 1997లో వెలుగు సంస్థను స్థాపించిన స్వర్గీయ పి.పద్మజ యొక్క19వ వర్ధంతి సందర్భంగా వెలుగు ప్రెసిడెంట్ ఎన్.వి.రమణ రావు,హెడ్‌మాస్టర్ వాసుదేవ రెడ్డి మరియు రియల్ ఎస్టేట్ మస్తాన్‌రెడ్డి, రియల్ ఎస్టేట్ దేవేంద్ర రెడ్డి, సుజాత విచ్చేశారు.ఇందులో భాగంగా స్వర్గీయ పద్మజ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వెలుగు ప్రిన్సిపల్ పి.లీనా కుమారి మాట్లాడుతూ స్వర్గీయ పద్మజ 15 మందితో వెలుగును ప్రారంభించి, ప్రస్తుతం 190 మందికి ఆశ్రయం, విద్య కల్పిస్తున్నది. ఈ రోజు 19వ వర్ధంతి జరుపుకుంటున్న మన అందరి హృదయాలలో చిరస్మరణీయంగా ఉంటారని తెలిపారు.వెలుగు సంస్థను ఉదయ్ మోహన్ రెడ్డి, భాగ్యలక్ష్మి, వెలుగు ప్రిన్సిపల్ పి.లీనా కుమారి ఆధ్వర్యంలో అంచెలంచెలుగా ఎదిగి ఎంతో మందికి ఆశ్రయం కల్పిస్తుందనీ, దీనికి అండదండలుగా ఉండి నడిపిస్తున్న ప్రతి ఒక్కరు అభినందనీయులనీ తెలిపారు. బెంగుళూరులోని మణిపాల్ ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న డాక్టర్ అరవింద రెడ్డి, డాక్టర్ సతీష్ కుమార్‌రెడ్డి ప్రతి సంవత్సరంలాగానే ఈ సంవత్సరం కూడా స్వర్గీయ పద్మజ వర్ధంతి సందర్భంగా పిల్లలకు ఏకరూప దుస్తులు, వెలుగు మదర్స్‌కు చీరలు పంపిణి కొరకు రూ.40 వేలు విరాళాన్ని అందజేశారు.అనంతరం స్వర్గీయ పద్మజ వర్ధంతిని పురస్కరించుకుని పిల్లలకు, వృద్ధులకు ఉదయ్ మోహన్‌రెడ్డి బంధుమిత్రులందరు అన్నదానం చేశారు. కార్యక్రమంలో వెలుగు సిబ్బంది, చిన్నారులు, వృద్ధులు పాల్గొన్నారు.



వృద్ధులకు దుస్తులు అందజేస్తున్న వెలుగు సిబ్బంది



ఓటరు జాబితాను పరిశీలిస్తున్న జెసి ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

ఓటర్ల నమోదు త్వరగా పూర్తి చేయాలి : జెసి

ప్రజాశక్తి- కలకడ

ఓటర్ల నమోదు త్వరగా పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ తెలిపారు. మంగళవారం ఓటర్ల తొలగింపుపై బిఎల్ఒలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని బిఎల్ఒలు ఓటర్ల నమోదు కార్యక్రమం త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. జనరల్ 26 లోపల తొలగించిన ఓటర్ల జాబితాను పరిశీలించి, తనిఖీలు చేశారు. ఓటర్ల తొలగింపు పై కారణాలను అడిగి తెలుసుకుని వీలైనంత తొందరగా తొలగింపు కారణాలు తెలపాలన్నారు.ఓటర్ల జాబితాలో ఉన్న ఫారం-7ను తనిఖీలు నిర్వహించి సక్రమంగా విధులు నిర్వహించని వారికి సూచనలు సలహాలు అందించినట్లు తెలిపారు.ప్రతి ఒక్కరూ సమయపాలన పాటించి, విధులను సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శించినచో వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో తహసిల్దారు ప్రదీప్, రీ సర్వే డిప్యూటీ తహశీల్దారు చంద్రశేఖర్, వీఆర్వోలు, బిఎల్ఒలు పాల్గొన్నారు.

'మా భూమి ఇప్పించండి సారూ..!'

- ఓ దళిత వృద్ధుడి వేడుకోలు

ప్రజాశక్తి- రాయచోటి

'మా భూమి మాకు ఇప్పించండి' సారు అంటూ సంబేపల్లి మండలం మోటకట్ల గ్రామం ప్రకాష్ నగర్ కాలనీకి చెందిన పెద్దమూగ వెంకటరమణ మంగళవారం అధికారులను పేర్కొన్నారు. తన తల్లి పెద్దమూగ చిన్న రామక్క, తండ్రి గంగులయ్య పేరుతో ఎకరా 20 సెంట్లు పైగా భూమి ఉందని తెలిపారు. కొనేళ్లుగా తామే సాగు చేసుకుంటున్నామని, ఆయనప్పటికీ కొందరు ఆ భూమిని తమకు దక్కకుండా చేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తమ భూమిని ఇతరులకు కట్టబెట్టేందుకు సంబంధిత రెవెన్యూ అధికారులు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. తమ భూమి వద్దకు వచ్చి ఇతరు లకు భూమిని ఆన్‌లైన్ చేసేందుకు కుట్రపన్నుతున్నారని వాపోయారు. తమ తల్లి పేరుతో ఉన్న తనపేరుపై ఆన్‌లైన్ చేయాలని అధికారులను కోరుతున్నా పట్టించుకోవడం లేదని చెప్పారు. స్పందనలో కూడా పలుమార్లు అర్జీలను పెట్టుకున్నామని అయినా ప్రయోజనం లేదని వాపోయారు. ఇప్పటికైనా కలెక్టర్ సారూ గమనించి తన తల్లి పేరుతో ఉన్న భూమిని తనపైరుతోఆన్‌లైన్ చేయించి న్యాయం చేయాలని కోరారు.

వక్ఫ్ బోర్డుకు ప్రత్యేక గది కేటాయించాలి

ప్రజాశక్తీ-మదనపల్లె అర్బన్



ఎమ్మెల్సీకి వినతిపత్రం ఇస్తున్న కరీముల్లా

మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో జిల్లా వక్ఫ్ బోర్డు కార్యాలయం కొరకు ప్రత్యేక గదిని కేటాయించాలని కోరుతూ జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ ఖాన్, ఎమ్మెల్సీ జఖీయా ఖానంలను జిల్లా వక్ఫ్ బోర్డ్ చైర్మన్ ఎస్.ఎ. కరీముల్లా కలసి వినతి పత్రం అందజేశారు. మంగళవారం మర్యాద పూర్వ కంగా కలసి వారిని శాలువ, పుష్ప గుచ్ఛంతో ఘనంగా సన్మానించారు. వక్ఫ్ బోర్డ్ అభివృద్ధికి సహకరించాలని వారిని కోరారు. వక్ఫ్‌బోర్డు సమస్యలు పరి ష్కారానికి చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు.అదేవిధంగా వక్ఫ్ బోర్డు అభివృద్ధి పనులు, అపరిష్కృత సమస్యలను దృష్టికి తీసుకెళ్లామన్నారు. కార్యక్రమంలో వక్ఫ్ బోర్డు డైరెక్టర్ పజులుల్లా ఆరిఫ్, అష్రఫ్, మౌలానా మాలిక్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

మహిళ ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి-మొలకలచెరువు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రాధ

కుటుంబ కలహాలతో ఓ మహిళ విషం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డ సంఘటన మంగళవారం మండలంలో చోటుచేసుకుంది. బాధితురాలి కుటుంబీకుల కథనం మేరకు..మండలంలోని సోంపల్లి పంచాయతీ, యేసువారిపల్లికి చెందిన నారాయణ మద్యం తాగి ఇంటికి రావడంతో భార్య రాధా మందలించింది. నారాయణ భార్యను దూషించడంతో మనస్థాపం చెంది ఇంట్లో ఉన్న పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. కుటుంబీకులు గమనించి చికిత్సల నిమిత్తం హుటాహుటిన ఆమెను మొలకలచెరువు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మదనపల్లి జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రి అత్యవసర విభాగం వైద్యులు మెరుగైన వైద్య చికిత్సలు అందించి పరిస్థితి విషమంగా ఉందని వెంటనే తిరుపతి రుయాకు వెళ్లాలని సూచించారు. కేసు దర్యాప్తులో ఉందని పోలీసులు తెలిపారు.

ఉరేసుకొని వివాహిత ఆత్మహత్య

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

మండలంలోని కోనంపేట పంచాయతీలోని కె.వడ్డేపల్లికి చెందిన నాగవేణి (22) అనే వివాహిత మంగళవారం తన ఇంటిలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ మల్లికార్జున్‌రెడ్డి తెలిపారు. మృతురాలు చక్రాయపేట మండలం కొండుగారిపల్లికి చెందిన ఓ వ్యక్తితో రెండు సంవత్సరాల క్రితం వివాహమైందన్నారు. ఈ మధ్యకాలంలో తన పుట్టినిల్లయిన లక్కిరెడ్డిపల్లి మండలం వడ్డేపల్లిలో ఉంటోందని చెప్పారు. కడుపునొప్పి తాళలేక ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు పేర్కొన్నారు. తహశీల్దార్ ఉదయ శంకర్ రాజు, ఎస్ఐ మల్లికార్జున్‌రెడ్డి సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతురాలుని ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. ఈ సంఘంటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో ప్రేమికులు మృతి

ప్రజాశక్తి-పెద్దమద్యం



అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సందీప్, సౌమ్య

మండలంలోని పాపేపల్లి పంచాయతీ గొల్లవానికుంట పోయే దారి సమీపంలో ప్రేమికులు అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు కథనం మేరకు.... రాయచోటి మండలం గొల్లముదేడు పంచాయతీ ఎండపల్లి బాలిరెడ్డిగారిపల్లికి చెందిన సందీప్, గుర్రంకొండ మండల ఎల్లుట్లపంచాయతీ శీలంవాండ్లపల్లికి చెందిన సౌమ్యతో అంగళ్లు సమీపంలోని ఓ ప్రయివేటు కాలేజీలో ఇంటర్ చదువుతున్న సమయంలో సందీప్ పరిచయం ఏర్పడింది. సందీప్ కాలేజి బస్సు డ్రైవర్‌గా వెళ్ళేవాడు. ఆతరువాత సందీప్ మదనపల్లె ఆర్‌టిసి బస్సుకు కాంట్రాక్టు డ్రైవర్ పనిచేస్తున్నాడు. సౌమ్య మదనపల్లెలో ఓ ప్రయివేటు కాలేజిలో డిగ్రీ మొదటి చేరింది. ప్రేముకుల మృతిపై పలు అనుమానాలు ఉన్నట్లు తెలిసింది. ఈవిషయం తెలుసుకున్న తంబళ్లపల్లి ఎస్ఐ లోకేష్‌రెడ్డి సంఘటనా స్థలాన్ని చేరుకొని పరిశీలించి మృతదేహాలకు శవపంచనామా కోసం మదనపల్లె ప్రభుత్వం ఆసుపత్రికి తరలించారు. ప్రేమికుల మృతి అనుమానాస్పద కేసు నమోదు చేసినట్లు తంబళ్లపల్లె ఎస్ఐ పేర్కొన్నారు.